క్లుప్తంగా

కేజీబీవీలో ఆడిట్



రికార్డులను పరిశీలిస్తున్న ఆడిట్ బృందం

హిరమండలం: స్థానిక కస్తూర్బా బాలికా విద్యాలయంలో గురువారం సోషల్ ఆడిట్ జరిగింది. జిల్లా కేంద్రం నుంచి ఎస్ఆర్‌సీ జగన్ ఆధ్వర్యంలో ఇద్దరు సభ్యులతో కూడిన బృందం విద్యాలయాన్ని సందర్శించింది. రికార్డులతోపాటు విద్యార్థుల హాజరు పరిశీలించారు. ఆహార పదార్థాలకు సంబంధించి మెనూతోపాటు విద్యార్థులకు అందుతున్న వసతులపై ఆరా తీశారు. విద్యార్థినుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రత్యేకాధికారి ఎస్.కృష్ణవేణి, సీఆర్‌టీలు, ఉపాధ్యాయేతర సిబ్బందితో మాట్లాడారు.

మినీ గోకులాలను సద్వినియోగం చేసుకోవాలి

మెళియాపుట్టి: మండలంలోని కొసమాల గ్రామంలో బి.సాయమ్మకు సంబంధించిన మినీ గోకులం షెడ్‌ను గురువారం ఎంపీడీఓ నరసింహప్రసాద్ పండా పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న 90 శాతం ఉపాధి హామీ నిధులు, 10 శాతం రైతు వాటాతో నిర్మాణం చేపట్టిన షెడ్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీఓ రవి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

రహదారులను నిర్మిస్తాం



వెన్నెలవలసలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

సరుబుజ్జిలి: ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని తెలికిపెంట నుంచి అగ్రహారం వరకు నిర్మించనున్న ఆర్అండ్‌బీ రోడ్డు పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. నియోజకవర్గంలో అన్ని రహదారి పనులు పూర్తిచేయడం జరుగుతుందన్నారు. వెన్నెలవలస ప్రాంతంలో థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటు కోసం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం ఆర్డీఓ సాయిప్రత్యూష, తహసీల్దార్ మధుసూదన్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం



మాట్లాడుతున్న ఆర్వో లావణ్య

నరసన్నపేట: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధంతో సమానమని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందవచ్చని నరసన్నపేట ఆర్వో, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.లావణ్య అన్నారు. ఓటర్ల దినోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న పక్షోత్సవాల సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఓట్ ఫర్ ష్యూర్ అనే అంశంపై గురువారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ ఓటు హక్కు పొందడంతోపాటు దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానంగా యువత చైతన్యవంతం కావాలన్నారు. ఓటుతో మంచి నాయకులను ఎన్నుకోవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.లత మాట్లాడుతూ ఓటు ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శాంతి హేమ్, వ్యవసాయాధికారి కె.సునీత, తదితరులు పాల్గొన్నారు.

సూర్య ఘర్ యోజనపై అవగాహన



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా

పాతపట్నం: సూర్య ఘర్ యోజనపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించాలని జెడ్పీ సీఈఓ ఎల్.ఎస్.వి.శ్రీధర్ రాజా అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం అధికారులతో మాట్లాడారు. సూర్య ఘర్ యోజనపై గ్రామాల్లో ప్రజలకు సచివాలయ సిబ్బందితో కలిసి అవగాహన కల్పించాలన్నారు. సామన్య ప్రజలను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయన్నారు. ఎంపీడీఓ చంద్రకుమారి, ఈఓపీఆర్డీ వెంకటరావు, ఏఓ తిరుపతి పట్నాయక్, మిత్రో, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్


పొందూరు: మండలంలోని లోలుగు కాలనీలో జూదం ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను బుధవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు, స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ వి.సత్యనారాయణ తన సిబ్బంది, టాస్క్‌ఫోర్సు సిబ్బందితో కలిసి శిబిరంపై దాడి చేశారు. 8 ద్విచక్ర వాహనాలు, 7 సెల్ ఫోన్లు, రూ.10,080 నగదు స్వాధీనం చేసుకున్నారు.

అక్రమాలకు చెక్

- ఉపాధి వేతనదారుల కోసం జన్‌మన్‌రేగా యాప్
- 2017లోనే అందుబాటులోకి..
- యాప్‌లో ఉపాధి వేతనదారుల సమగ్ర వివరాలు
- అవగాహన పెంచుకోవాలంటున్న అధికారులు



దేశవానిపేటలో చెరువులో పనులు చేస్తున్న వేతనదారులు (ఫైల్)



నరసన్నపేట: ఉపాధి వేతనదారులకు వరంగా ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు సంస్కరణలను తీసుకువస్తోంది. అక్రమాలకు తావివ్వకుండా చర్యలు తీసుకుంటోంది. పనుల మంజూరు, నిర్వహణ, వేతనాలకు సంబంధించిన అనేక చేర్పులు, మార్పులు తీసుకువస్తోంది. వేతనాల దుర్వినియోగం కాకుండా నేరుగా బ్యాంకులు, పోస్టాఫీసుల్లో ఖాతాలను తెరిపించి జమ చేయిస్తోంది. వేతనదారులు చాలామంది తమకు కేంద్రం కల్పిస్తున్న సదుపాయాలపై అవగాహన లేక అవస్థలు పడుతున్నారు. ఉపాధి బకాయిలు జమ అయ్యాయా, లేదా, ఒకవేళ జమ చేస్తే ఏ బ్యాంక్ ఖాతాలో జమ అయ్యాయో తెలియక ఉపాధి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

అందుబాటులోనికి వచ్చిన యాప్..

పలు సమస్యల నుంచి గట్టెక్కించేందుకు కేంద్ర ప్రభుత్వం జన్‌మన్‌రేగా యాప్‌ను అందుబాటులోనికి తీసుకువచ్చింది. దీనిపై సరైన అవగాహన లేక వేతనదారులు ఉపయోగించుకోలేక పోతున్నారు. ఈ యాప్ వేతనదారులకు బ్రహ్మాస్త్రం వంటిదని అధికారులు అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపాధి శాఖలో కింది స్థాయి సిబ్బంది పైనా ప్రతాపం చూపి కక్ష సాధింపులకు దిగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో జనమన్‌రేగా యాప్‌తో ఉపాధి పనుల్లో అక్రమాలకు చెక్ చెట్టేందుకు వీలవుతుంది.

యాప్ వినియోగం ఇలా..

స్మార్ట్ ఫోన్లలోని గూగుల్ ప్లే స్టోర్‌లోనికి వెళ్లి జనమన్‌రేగా అని టైప్ చేసి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆ తరువాత ఇన్‌స్టాల్ చేసుకొని అందులో ఉపాధి జబ్‌కార్డుల సంఖ్య నమోదు చేసి క్లిక్ చేస్తే వేతనదారుల వివరాలు వస్తాయి. వేతనదారు జనమన్‌రేగా యాప్ లోగో పేరుపై క్లిక్ చేయగానే పని చేసిన రోజులు, వేతన బకాయిలు.. ఏ బ్యాంక్ ఖాతాలో నగదు ఉంది, తదితర వివరాలు స్పష్టంగా తెలుస్తాయి. వేతనం జమకాకపోతే అందుకు గల కారణాలనూ తెలుసుకోవచ్చు. ఉపాధి పనుల సమాచారం కూడా ఉంటుంది.

అక్రమాలపైనా ఫిర్యాదు చేయవచ్చు..

వేతనాల స్వాహాతోపాటు ఇతర అక్రమాలపై కూడా జనమన్‌రేగా యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు. క్షేత్రస్థాయిలో పని ప్రదేశాల్లో వేనతారులతో కాకుండా యంత్రాలతో పనులు చేసినా, బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసినా, నిధులు దుర్వినియోగం చేసినా, బోగస్ మస్టర్లకు పాల్పడినా ఈ యాప్‌లో ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. నేరుగా సంబంధిత అధికారుల దృష్టికి వెళ్తుంది. అధికారులు వెంటనే స్పందించనున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



జనమన్‌రేగా యాప్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటికే కొంతమంది వేతనదారులు వినియోగిస్తున్నారు. ప్రతి గ్రామంలోనూ యాప్ వినియోగంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. 30 శాతం వరకు వేతనదారులు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు.
– యుగంధర్, ఏపీఓ, నరసన్నపేట

నరసన్నపేట నియోజకవర్గంలోని ఉపాధి హామీ జాబ్ కార్డులు, వేతనదారుల వివరాలు..

మండలం	నరసన్నపేట	జలుమూరు	సారవకోట	పోలాకి
జాబ్ కార్డులు	12,266	13,868	11,341	15,909
వేతనదారులు	18,677	21,849	18,137	27,129

వైఎస్సార్‌సీపీ బలోపేతమే ధ్యేయం

- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్



మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

బూర్జ: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కార్యకర్తలందరూ సమష్టిగా కృషి చేయాలని పార్టీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. మండలంలోని మదనాపురం గ్రామంలో గురువారం పార్టీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆశయ సాధనకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. కార్యకర్తలకు, పార్టీ శ్రేణులకు నిత్యం అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. గ్రామస్థాయి నుంచే పార్టీని బలోపేతం చేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం ప్రజల సమస్యలను పూర్తిగా పట్టించుకోవడం లేదన్నారు. తనను ఎమ్మెల్యే కూన రవికుమార్ ఎన్ని విధాలుగా విమర్శించినా.. ప్రజలు మద్దతు ఉంటే ఎవరూ ఏమీ చేయలేరన్నారు. అందరం కలిసికట్టుగా ఉందామని పిలుపునిచ్చారు. బూర్జ ఎంపీపీ కర్నేన దీప, జెడ్పీటీసీ సభ్యులు బెజ్జిపురపు రామారావు, సరుబుజ్జిలి సురవరపు నాగేశ్వరరావు, ఆమదాలవలస మున్సిపాల్టీ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, బద్రి రామారావు, ఆమదాలవలస మాజీ కౌన్సిలర్ దుంపల శ్యామలరావు, నాయకులు ఎల్.కృష్ణమూర్తి, జల్లు బలరాంనాయుడు, బొడ్డేపల్లి నాగరాజు, చొక్కర కృష్ణమోహన్, తొత్తడి సురేష్, మామిడి నరసింగరావు, ఏగు రాజారావు, సర్పంచ్‌లు, ఎంపీటీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

యంత్రాల పంపిణీ



వరి పంట తరువాత పొలాల్లో నేరుగా మొక్కజొన్న సాగు చేసే రైతులకు వరుసలు, విత్తనాల మధ్య సమాన దూరం కోసం డబుల్ వీల్ మార్క్ యంత్రం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఆమదాలవలస కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. గురువారం సరుబుజ్జిలి మండలంలోని చిగురవలస గ్రామంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కజొన్న సాగుచేసేందుకు ఉపయోగపడే డబుల్ మార్క్ యంత్రాలను రైతులకు పంపిణీ చేశారు. రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ తవిటినాయుడు, సమన్వయకర్తలు అత్తులూరి లావణ్య, బి.రాజ్‌కుమార్, ధర్మారావు, ఏసు, తదితరులు పాల్గొన్నారు.
– సరుబుజ్జిలి

చెత్త తొలగింపు

సారవకోట: మండలంలోని బుడితి గ్రామంలో గల చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి ఆనుకుని రోడ్డు పక్కనే ఉన్న చెత్త కుప్పలను గురువారం తొలగించారు. మంగళవారం సాక్షిలో రోడ్డు పక్కనే చెత్త కుప్పలు అనే వార్త ప్రచురితమైంది. దీనిపై ఎంపీడీఓ మోహన్‌కుమార్ స్పందించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జేసీబీలతో చెత్త కుప్పలను తొలగించారు.

సాక్షి ఎఫెక్ట్



జేసీబీతో చెత్త కుప్పలను తొలగిస్తున్న దృశ్యం

దుర్వాసనతో అవస్థలు

నరసన్నపేట: స్థానిక ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో నాబార్డు నిధులతో భవన నిర్మాణాలు సాగుతున్నాయి. సివిల్ వర్క్ కారణంగా గతంలో వేసిన డ్రైనేజీ, వార్డుల నుంచి వచ్చే వాడుక నీరు పైపులు ధ్వంసమయ్యాయి. ఈ పైపుల నుంచి వస్తున్న నీటితో ఆస్పత్రి బయట సోషల్ క్లబ్‌వైపు దుర్వాసన వెదజల్లుతోంది. నాబార్డు పనులు చేస్తున్న ఇంజినీరింగ్ సిబ్బంది, కాంట్రాక్టు ప్రతినిధులు పట్టించుకోవడం లేదు. కోవెల వీధి వైపు కూడా మురుగునీరు గుంత ఏర్పడింది. దీంతో రోగులు అవస్థలు పడుతున్నారు. ఆస్పత్రికి జబ్బులు తగ్గుతాయని వస్తే ఈ దుర్వాసన, మురుగునీటితో మరింత పెరుగుతున్నాయని రోగులు వాపోతున్నారు. దీనిపై అధికారులు వెంటనే స్పందించాలని కోరుతున్నారు.



ఆస్పత్రి బయట విరిగిన పైపులు

రహదారి సమస్య పరిష్కారం

నరసన్నపేట: మండలంలోని జమ్ము పంచాయతీ పొన్నాడపేట రోడ్డు నిర్మాణ సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. గురువారం రోడ్డు పనులు చేస్తుండగా.. జమ్ముకు చెందిన కొందరు రైతులు అడ్డుకోవడానికి ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సత్యనారాయణ, సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐలు అశోక్‌బాబు, దుర్గాప్రసాద్ తమ సిబ్బందితో వెళ్లి వారికి నచ్చజెప్పారు. అయినా వారు ససేమిరా అంటూ తమ జిరాయితీ భూముల పైనుంచి రోడ్డు వేయడం సరికాదని, తమకు న్యాయం చేయాలని తహసీల్దార్‌ను కోరారు. గతంలో నుంచి రోడ్డు ఉందని.. ఇప్పుడు అభ్యంతరం చెప్పడం భావ్యం కాదని అధికారులు తీవ్రంగా భావించారు. పోలీసు అధికారులు వచ్చి రోడ్డు నిర్మాణానికి అడ్డుపడవద్దని కోరారు. అయినా వారు సమ్మతించకపోవడంతో తహసీల్దార్ జోక్యం చేసుకుని ఈ రోడ్డు నిర్మాణంలో స్థలం పోయిన వారికి ప్రత్యామ్నాయంగా మరో దగ్గర ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో అంగీకరించారు. 13 మందికి న్యాయం చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఉపాధి నిధులతో పొన్నాడపేటకు సీసీ రోడ్డు నిర్మాణానికి అంగీకరించారు. వెంటనే పనులు నిర్వహించారు. పొన్నాడపేట గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.



జమ్ము రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్, అధికారులు

విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో సర్పంచ్ రత్నాలు, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్, తదితరులు

కొత్తూరు: మండలంలోని పారాపురం ఎంపీపీ పాఠశాలలో మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌ను రిపబ్లిక్ డే పురస్కరించుకుని ఎంఈఓలు గోవిందరావు, శ్రీనివాసరావు సూచనల మేరకు 75 మార్కులకు గురువారం నిర్వహించారు. విద్యార్థులకు బహుమతులను పారాపురం సర్పంచ్ కుంచాల రత్నాలు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నందకుమార్, ఏఓ బసవ రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు వనుము లక్ష్మీనారాయణ, పీఎంసీ చైర్మన్ రాంప్రసాద్, రేణుక అందజేశారు. హెచ్ఎం చంద్రకాంత్, కె.శాంతారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోరాటయోధుడు నేతాజీ



నరసన్నపేట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

నేతాజీ సుభాష్ చంద్రబోస్ పోరాట యోధుడు అని పలువురు వక్తలు అన్నారు. నేతాజీ జయంతి సందర్భంగా గురువారం పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. నేతాజీ చిత్రపటాలు, విగ్రహాలకు నివాళులర్పించారు. స్వాతంత్య్ర ఉద్యమంలో నేతాజీ పాత్ర గురించి వివరించారు.
– సాక్షి నెట్‌వర్క్

దేశభక్తి..



సారవకోట మండలంలోని అవలింగి జేబీటీ పాఠశాల విద్యార్థులు గురువారం జాతీయ నాయకుల వేషధారణల్లో ఆకట్టుకున్నారు. జాతీయ జెండాలు పట్టుకుని అవలింగి, బుడితి, చీడిపూడి గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలన్నారు. ఈ నెల 26వ తేదీ గణతంత్ర దినోత్సవంలో భాగంగా విద్యార్థులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్ మోహనగాంధీ తెలిపారు.
– సారవకోట

నిర్లక్ష్యం..



కొత్తూరు మండలంలోని ఎస్ఎస్‌కాలనీలో మధ్య నుంచి వెళ్తున్న తామర చెరువు సాగునీటి కాలువ పాలిథిన్ కవర్లు, పూడికలతో నిండిపోయింది. దుర్వాసన రావడంతో కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారు. చాలా కాలంగా కాలువను శుభ్రం చేయకపోవటంతో పంటలకు కూడా సాగునీరు సరిగా అందడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువను శుభ్రం చేయాలని సంబంధిత అధికారులను స్థానికులు, రైతులు కోరుతున్నారు.
– కొత్తూరు

పీఎం ఇంటర్న్‌షిప్‌కు 24 మంది అర్హత

హిరమండలం: పీఎం ఇంటర్న్‌షిప్‌నకు సంబంధించి మండలంలో 24 మంది రిజిస్ట్రేషన్ అనుమతికి అర్హత సాధించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పీఎం ఇంటర్న్‌షిప్ పేరిట నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నాయి. వీటికి సంబంధించి గురువారం దరఖాస్తులను స్వీకరించారు. మండల వ్యాప్తంగా 84 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వయసు, విద్య, ఇతరత్రా అర్హతలకు సంబంధించి కేవలం 24 మంది మాత్రమే అర్హత సాధించారు. వారి దరఖాస్తులు మాత్రమే రిజిస్ట్రేషన్లు చేశారు. ఎంపికైన వారికి శిక్షణతోపాటు నెలకు రూ.5 వేల గౌరవ వేతనం కూడా అందించనున్న సంగతి తెలిసిందే. 60 దరఖాస్తులను తిరస్కరించారు.

సంక్షిప్తంగా..

అమ్మకానికి సిద్ధంగా కొబ్బరి మొక్కలు

బూర్జ: పెద్దపేటలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం, ఉద్యాన పరిశోధన స్థానంలో అమ్మకానికి కొబ్బరి మొక్కలు సిద్ధంగా ఉన్నాయని ప్రధాన శాస్త్రవేత్త, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అశోక్ గురువారం తెలిపారు. ఒక్క మొక్క ఖరీదు రూ.100 అన్నారు. కొబ్బరి మొక్కలు కావాల్సిన రైతులు ఫోన్ 8074842696ను సంప్రదించాలన్నారు.

ప్రహరీ నిర్మాణంపై ఫిర్యాదు

కొత్తూరు: మండలంలోని గూనభద్ర పంచాయతీ పరిధి పాత జూట్ ఫ్యాక్టరీ స్థలంలో ప్రహరీ నిర్మాణంపై తహసీల్దార్ రవిచంద్రకు సర్పంచ్ వాణితో పాటు గ్రామస్తులు గురువారం ఫిర్యాదు చేశారు. ప్రహరీ నిర్మాణంలో ప్రభుత్వ, ఆర్అండ్‌బీ స్థలాలను ఆక్రమించిన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రహరీ నిర్మాణంలో భాగంగా గ్రామదేవత చెట్టు కొమ్మలను తొలగించారన్నారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టాలని మండల సర్వేయర్ గవరయ్యకు తహసీల్దార్ ఆదేశించారు. ఈ మేరకు మండల సర్వేయర్ సర్వే చేపట్టారు. శుక్రవారం మరోసారి సర్వే చేసిన అనంతరం నివేదికను తహసీల్దార్‌కు అందజేస్తామని సర్వేయర్ తెలిపారు.

అదుపుతప్పిన ఇసుక లారీ

బూర్జ: మండలంలోని చీడివలస గ్రామంలో బుధవారం రాత్రి ఇసుక లారీ అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న ఫర్నీచర్ షెడ్ మీదకు దూసుకెళ్లింది. రాత్రి సమయంలో ఘటన జరగడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొట్టి ఉంటే తీవ్రమైన నష్టం జరిగేదని గ్రామస్తులు తెలిపారు. పొట్నూరు శ్రీరాములు ఫర్నీచర్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. షెడ్ ధ్వంసం కావడంతో లబోదిబోమంటున్నారు. ప్రభుత్వమే తగిన న్యాయం చేయాలని షెడ్ యజమాని కోరుతున్నారు.

మందుల దుకాణాల్లో తనిఖీలు



అపోలో ఫార్మసీలో తనిఖీలు నిర్వహిస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్

ఆమదాలవలస: పట్టణంలోని పలు మందుల దుకాణాలను డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఆశేష్ తనిఖీ నిర్వహించారు. అయితే ముందుగానే సమాచారం పొక్కడంతో చాలావరకు మందుల దుకాణాలు మూసివేశారు. దీంతో రెండు అపోలో ఫార్మసీ దుకాణాల్లో మాత్రమే తనిఖీలు చేపట్టారు. అయితే వివరాలు మాత్రం వెల్లడించలేదు. ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీలు నిర్వహించినట్లు సమాచారం. మందుల దుకాణాలు తనిఖీలకు వస్తున్నట్లు ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఒకరు ముందుగానే సమాచారం అందజేసినట్లు ప్రచారం జరుగుతోంది.

59 మద్యం బాటిళ్ల స్వాధీనం

నరసన్నపేట: స్థానిక సత్యవరం కూడలిలోని సర్వీస్ రోడ్డుకు ఆనుకొని మద్యం బాటిళ్లు అక్రమంగా కలిగి ఉన్న బోటు తవిటయ్యను పట్టుకొని అరెస్టు చేశామని ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. ఆయన వద్ద నుంచి బుధవారం రాత్రి 59 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. శ్రీకాకుళం టాస్క్‌ఫోర్స్ సిబ్బంది వచ్చి తనిఖీలు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. గురువారం తవిటయ్యను అరెస్టు చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



ఘటనా స్థలంలో కారు, బైక్


ఎల్.ఎన్.పేట: మండలంలోని అలికాం–బత్తిలి (ఏబీ) ప్రధాన రహదారి కోవిలాం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడ్డారు. బాధితుని బంధువులు, స్థానికులు తెలియజేసిన వివరాల ప్రకారం.. కొత్తూరు నుంచి నరసన్నపేట వైపు కారు వస్తుంది. ఎల్.ఎన్.పేట మండలం పెద్దకోట గ్రామానికి చెందిన దుద్దు దుర్గారావు తన గ్రామానికి వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఎదురెదురుగా వస్తున్న కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. బైక్‌పై వస్తున్న దుర్గారావుకు గాయాలయ్యాయి. గాయపడిన దుర్గారావును స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కోట గోవిందరావు, ప్రెస్‌క్లబ్ సభ్యులు

ఆమదాలవలస: ఆమదాలవలస ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో 2025 క్యాలెండర్‌ను తయారు చేశారు. ఈ క్యాలెండర్‌ను వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి కోట గోవిందరావు సమక్షంలో గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పూర్ణచంద్రరావు, సభ్యులు, వివిధ పత్రికల రిపోర్టర్లు పాల్గొన్నారు.



సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆమదాలవలస/ పాతపట్నం: 9010177724
నరసన్నపేట: 9912220367
Office mail : sklmadvt@gmail.com